# అనంతరం

ఉదయం అయిదు గంటలు కావస్తోంది. శీతాకాలం కావడం వల్ల ఇంకా రాత్రి లాగే వుంది. దట్టమైన మంచు పొగలా వూరంతా కమ్మేసినట్టుంది.

గడియారం సరిగ్గా అయిదుగంటలు కొట్టిందో లేదో పార్వతమ్మగారి కుక్క భయంకరంగా అరవసాగింది.

మేడ మీది గదిలో పడుకుని బ్లాంకెట్ ముసుగెట్టి నిద్రపోతున్న పార్వతమ్మ గారు త్రుళ్ళిపడి లేచింది.

కుక్క అదే పనిగా అరుస్తోంది. -ప్పుడు గుర్తొచ్చిందామెకి, రాత్రి కుక్కని వదల్లేదని, నిమ్మకుంటూ కిందికొచ్చి వీధిలో లైట్లు వేసింది. కుక్క అరవటం కాస్త మాని, మళ్ళీ మొదలుపెట్టింది.

పార్వతమ్మగారు కుక్కని విప్పడానికి వరండాలో కొచ్చి వరండా తలుపుని తీసింది.

అంతే! కొయ్యబారి పోయింది.

కారణం విశాలమైన మెట్ల మీద ఓ పసి బిడ్డ! పాత గుడ్డల్లో నిద్ర పోతున్నాడు. క్షణం ఏం చెయ్యాలో తోచలేదామెకి. తేరుకుని పాలేరు రంగన్న ని పిల్చింది. పాల తెల్పిన రంగన్న కంగారుగా వచ్చాడు. వాడూ దిమ్మెర పోయాడు పసి వాణ్ణి చూసి.

"ఎవరీ బిడ్డ," అంది పార్వతమ్మ గారు కంగారుగా.

"ఏమోనమ్మా! నేనొచ్చేప్పుడు లేదిక్కడ" అన్నాడు రంగన్న మరింత కంగారు పడుతూ.

"ఎవరో కని వదేసినట్టున్నారు. ఆ పక్కన ఎవరైనా వున్నారేమో చూడూ" అందావిడ.

రంగన్న చూశాడు. కానీ ఎవరూ లేరు.

పార్వతమ్మగారికి దిక్కు తోచలేదు. పార్వతమ్మ గారంటే ఆ ప్రాంతాల్లో తెలియని వాళ్ళు లేరు. ఆవిడ లక్షాధికారి. మానవతా వాది అంటారంతా. ప్రజా సేవే పరమార్థంగా భావించే ఆ ఇల్లాలంటే అందరికీ అంతులేని గౌరవ మర్యాద లున్నాయి. ఆ గౌరవంతోటే ఆమెని ఓ క్లబ్ కి ప్రెసిడెంట్ ని చేశారు కూడా. భర్త చిన్న తనంలోనే కాలం చేసినా, తనకంటూ సంతానం లేక పోయినా, ధైర్యంగా సంఘ సేవ చేస్తూ, అందరి గౌరవమర్యాదల్నీ అందుకుంది.

అలాంటి పార్వతమ్మగారి లోగిలి ముంగిట ఓ పసిగుడ్డు పడున్నాడు.

నిర్ఘాంత పోయినట్టు నిల్చుండి పోయిందావిడ.

క్రమేపీ వెలుగొచ్చింది.

పార్వతమ్మ గారి లోగిట్లో ఎవరో ఓ బిడ్డని కని వదేశారన్న వార్తవూరంతా వ్యాపించింది. తిరుణాల్లా వచ్చి పడ్డారు జనం. నడి బజారులో మేజిక్ చూస్తున్నంత సరదాగా, కుతూహలంగా చూస్తూ మాటల్లో పడ్డారు.

"అబ్బ ఎంత బావున్నాడో, ముద్దులు మూట కడుతున్నట్టున్నాడు కదూ!"

"అవును చిదిమి దీపం పెట్టుకోవచ్చు. హు! ఇలాంటి జన ముద్దు బిడ్డని పారెయ్యడానికి తల్లి మనసెలా ఒప్పిందో!"

"అది మనసా! రాయి! అసలు ఇలాంటి బిడ్డ ఒక్కడుంటే జన్మ ధన్యంకాదూ!"

"ఎలా ముడుచుకు పడుకున్నాడో! పాపం! చలేస్తున్నట్టుంది! ఎప్పుడు వదేసిందో ఆ మహా తల్లి! అయినా ఏమీ కాని మనకే హృదయం ద్రవిస్తోందే, కన్న పేగు కదా, ఆ తల్లి కెలా జాల్లేదో!"

"నయం కుక్కలు పీకెయ్యలేదు."

"కాదు మరీ! నెత్తురు గుడ్డాయె! పార్వతమ్మ గారి గురించి తెలిసిన ఇల్లాలయుండాలి. అందుకే ఈ లోగిల్లో వదిలి పోయింది!"

ఇలా ఎవరికి తోచినట్టు వాళ్ళు వ్యాఖ్యానిస్తున్నారు. ఇవేమీ తనకి పట్టనట్టు పసివాడు హాయిగా నిద్ర పోతున్నాడు.

పొద్దెక్కిన కొద్దీ వచ్చే పోయే వాళ్ళ సంఖ్య పెరిగింది. ఎక్కడెక్కడివాళ్ళో వచ్చి చూసి పోతున్నారు.

వూరికి కాస్త దూరంగా వున్న గూడెంలో వుండే వాళ్ళు కూడా వచ్చి చూసి వెళ్ళారు.

తాగొచ్చిన భర్త చేత రాత్రి చావు దెబ్బలు తిని కుక్కి మంచంలో మూలుగుతూ పడున్న లచ్చి కూడా విన్నదా సంగతి.

అతి ప్రయాసగా లేచి పార్వతమ్మ గారింటి కేసి నడిచింది. ఒళ్ళంతా పచ్చి పుండులా వుంది . అయినా తూలుకుంటూ బయల్దేరింది. అక్కడి జనాల్ని తోసుకుంటూ లోపలి కెళ్ళింది.

పసివాడి చుట్టూ వలయంలా చేరిన జనం గోలగా మాట్లాడుతూనే వున్నారు.

తెల్లని చాయ, నల్లని జుట్టు, ఎర్రని చిన్న పెదవులు చూసి " ఏం పాపం చేశాడని ఈడికీ శిచ్చ! బొడ్డూడకుండానే దిక్కు లేనోడై పోయాడు" కళ్ళు తుడుచుకుంటూ పైకే అంది లచ్చి.

"శిక్షే మరి! అసలీ సినిమాలొచ్చి జనాల్ని పాడు చేస్తున్నాయి. లేక పోతే మా రోజుల్లో ఇలాంటివి ఎరుగుదుమా?" ఓ వృద్ధురాలు గొణుక్కుంది.

"పాపం! ఎవరో కలిగినింటి బిడ్డలాగే వున్నాడు!" కళ్ళు తుడుచుకుంటూ అంది పక్కింటి కామాక్షి.

"వెధవ పన్లు చెయ్యడానిక తెలిగి నిల్లేనిటి, కలగ నిల్లేనిటి" అన్నాడో ముసలాయన.

"ఎలాకంటే ఏం మగ నలుసుకంది! నువ్వూ వున్నావు-ఎందుకూ అర డజను మంది ఆడ సంతుని కని నా నెత్తిన వదెయ్యడానికి! ఇలాంటి మగ బిడ్డని ఒక్కణ్ణీ కంటే నా వంశం నిల్చేది కాదూ!" అన్నాడు కామాక్షి భర్త, ఆడ పిల్లల్ని కనడం భార్య చేసిన ఘోరమైన తప్పన్నట్టు.

"ఆం ఆం అంత అదృష్టం కూడానూ మన మొహాలకి! ఏదైనా పెట్టి పుట్టాల. అంతెందుకు-ప్రెసిడెంటుగారి పాలేరు పెళ్ళాం కూడా వరసగా నలుగురు కొడుకుల్ని కంది. ఏమిటో నీకు వున్నాను నరకం తప్పేట్టు లేదు" మూతి తిప్పుతూ కోడలికేసి కొర కొర చూసింది అతగాడి తల్లి.

పసివాడు కదిలాడు.

అందరి నోళ్ళూ క్షణం తక్కున మూత పడ్డాయి. ఆత్రతగానూ, కుతూహలంగానూ చూస్తున్నారా బిడ్డని. వాడు తల పక్కకి తిప్పి పెదవులుకి దువ్వుతున్నాడు పాలకోసం. గులాబీ రేకుల్లాంటి రెండు చేతులూ గుప్పెటగా మూసి బద్ధకంగా ఓసారి ఆవలించి ఆపై మెల్లగా రాగం మొదలు పెట్టాడు. అర నిమిషంలో అది గుక్కగా మారింది.

"అయ్యో! ఆకలిగావున్నట్టుంది" అందో ఇల్లాలు. పార్వతమ్మ గారింట్లోంచి పాలొచ్చాయి.

"వీడికీ పాలు ఎలా పట్టడం," అందో ఇల్లాలు అమాయకంగా.

"స్పూన్ తో పట్టొచ్చు" అన్నారెవరో. ఓ దయామయి వయ్యారంగా వచ్చి, స్పూన్నిండా పోసి, వాడి నోట్లో పొయ్య బోయి ముక్కూ నోటా పోసి, వాడు వుక్కిరి బిక్కిరౌతుంటే తెగ కంగారు పడిపోయింది.

ఆవిడగారికి పది మంది మాత్రమే సంతానం.

ఇదంతా చూస్తున్న లచ్చి కంగారుగా వాడి కళ్ళు, మొహం పైట కొంగుతో తుడిచి

"అయ్యో, అలా పోస్తే ఎలాగమ్మా, ఒళ్ళో పడుకో బెట్టుకు పొయ్యండి" అంది. అనరానిమాట అన్నట్టు అంతా మొహాలు చూసుకున్నారు.

రావినూతల సువర్ణాకన్నన్

''వీణ్ని ముట్టుకుని మేం అపవిత్రం అయి పోవాల!'' అన్న భావం అందరి మొహాల్లోనూ కనిపించింది లచ్చికి. అందుకే తను కూలబడి వాణ్ని ఒళ్ళోకి తీసుకుని స్పూన్‌తో జాగ్రత్తగా కాసిని పాలు పట్టింది. ఆకలి తీరాక వాడి ఏడుపు ఆగిపోయింది. మళ్ళీ మెల్లగా కళ్ళు ముసుకున్నాడు. తన వునికేమిటో, తన పరిస్థితిమిటో తెలియని పసివాడు హాయిగా నిద్రలోకి జారిపోయాడు.

భర్త కొట్టిన దెబ్బల వల్లా, రాత్రి తిండి తినక పోవడం వల్లా లచ్చికి కళ్ళు తిరిగి పోతున్నాయి. చెవులు ఘుడియలు పడుతున్నాయి. ఒళ్ళు స్వాధీనం తప్పుతోంది.

''ఇంకా కూడొండకుండా ఇక్కడేం సేత్తన్నావ్!'' అంటూ భర్త ఎక్కడ వచ్చి పడతాడో అన్న భయం ఆమెని మరింత ఒణికించేస్తోంది.

ఒళ్ళోని పసివాణ్ణి మళ్ళీ యథాస్థానంలో పడుకో బెట్టింది. వాడు నిద్ర పోతూనే వున్నాడు. అందరూ మూస్తూనే వున్నారు.

లచ్చికి వెళ్ళ బుద్ధి కావడం లేదు. ''ఈణ్నేం సేత్తారమ్మగారూ?'' తన బాధల్ని తాత్కాలికంగా మర్చిపోయి పసివాడి గురించి అడిగింది పార్వతమ్మని. ఆమె మాట్లాళ్ళేదు. అక్కడున్న జనాన్ని ఉద్దేశించి అడిగింది. వాళ్ళూ మాట్లాళ్ళేదు.

''అమ్మగారూ! మీకు మగ పిల్లల్లేరన్నారుగా, ఈణ్ణే తవరు పెంచుకోకూడదూ?'' అమాయకంగా అంది లచ్చి కామాక్షితో.

ఆవిడ తృళ్ళిపడి కంగారుగా భర్తకేసి మూసింది.



అత గాడి మొహం పెనంలా అయింది.

"అన్నట్టు ఇవాళ ఆఫీసుకు తొందరగా వెళ్ళాలి గుర్తు చేసి చావ్వేమే" అంటూ భార్య రెక్క పట్టుకుని ఎవరో తరుముతున్నట్టు పారిపోయాడు.

లచ్చి అందరికేసీ చూసిందోసారి జాలిగా. ఆమె కళ్ళలో ఏం కనిపించిందో మరి—

"అన్నట్టు కూర పొయ్యిమీదే వుంది. మాడి వచ్చిందో ఏవిటో" అంటూ వర వరా పరుగు తీసిందో ఇల్లాలు.

"అయ్యో నా మతి మండా, ఈ గొడవలో తలుపులు బార్లా తీసొచ్చాను. ఏ దొంగ వెధవో దూరుండడు కదా" కంగారుగా వెళ్ళిపోయిందింకో ఇల్లాలు.

"అయ్యయ్యో! పిల్లల స్కూళ్ళ సంగతే మర్చిపోయాను. ఇంటికి పడి ఏం ఆగం చేస్తున్నారో ఏవిటో" అంటూ తప్పుకుందో ఇల్లాలు.

"మైగాడ్! ఇవాళ సట్నం నుంచి మా ఫ్రెండ్ వస్తానన్నాడు, వచ్చి మేం లేవని తిరిగి పోయాడో ఏం కర్మో" అంటూ కుటుంబ సమేతంగా సౌద్యం చూస్తున్న ఓ మహామహుడు కుటుంబంతో సహా మాయమయ్యాడు.

పది నిమిషాల కల్లా ఆ పరిసరాలన్నీ నిర్మానుష్యంగా అయిపోయాయి— ఒక్క లచ్చి, పార్వతమ్మ గారు, ఈ హడావిడికి కారకుడయిన పసివాడు తప్ప. ప్రతిమ లా అయిపోయింది పార్వతమ్మ గారు

లచ్చి ఏం చెయ్యాలో అర్థం కానట్టు జాలిగా పసివాడి కేసి చూస్తూండి పోయింది.

అప్పుడే వచ్చాడు లచ్చి భర్త కోటప్ప.

లచ్చి హడలిపోయింది.

"ఏటే, ఇక్కడేం సేత్తన్నావ్?" అన్నాడు భార్య కేసీ, పసివాడి కేసీ మార్చి మార్చి చూస్తూ.

ప్రస్తుతం భర్త తాగి లేడని గ్రహించిన లచ్చికి కాస్త ధైర్యం వచ్చింది. విషయమంతా వివరించింది. వాడికీ జాలేసింది.

"అయితే ఎట్టా?" అన్నాడు స్వగతంగా అన్నట్టు ఎవరూ మాట్లాడక పోయేసరికి—

"అమ్మగోరూ! మీకు పిల్లల్లేరు గందా! ఈణ్ణి మీరు పెంచుకోకూడదూ!" అన్నాడు అర్థింపుగా—

తృళ్ళిపడింది పార్వతమ్మ గారు.

ఆవిడ మౌనం అంగీకారంగా భావించి

"లచ్చీ! అమ్మగోరు పెంచుకుంటారు ఈణ్ణి తీసికెళ్ళి లోన పడుకోబెట్టు" అన్నాడు వుత్సాహంగా.

పులి మీద పడ్డంత కంగారు పడిపోయింది పార్వతమ్మ గారు.

"అదెలా కుదురుతుందిరా" అంది గబ గబా.

కోటప్ప ఆవిడకి తెలుసు.

"ఏమ్మా?" అమాయకంగా అన్నాడతను.

"నాకు పిల్లల్లేని మాట నిజమే గానీ నాకు వ్యాపకాలు తక్కువ వున్నాయా! ప్రజా సేవకే నాకు టైమ్ చాలక తిండి కూడా సరిగ్గా తిండం లేదు. అలాంటిది ఇప్పుడీ పసి వెధవని తీసుకుని నేనేం పెంచ గలను? అదీ గాక వీడి కులమేమిటో, గోత్రమేమిటో ఛ! ఛ!" చేదుతిన్నట్టు మొహం పెట్టింది పార్వతమ్మ గారు.

"మరైతే ఏం సేత్తారీ పిల్లోన్ని?" దిగులుగా అన్నాడు కోటప్ప.

"అదే తోచి చావడం లేదురా" విసుగ్గా అందా విడ, రెండు నిమిషాల తర్వాత—

"అమ్మగారూ, ఓ పనైత్తే!" అంది లచ్చి.

ఆత్రుతగా చూసింది పార్వతమ్మగారు.

"ఈణ్ణి అనాదాశ్రమాల్లో ఏస్తే! ఇలాంటోల్ల కోసం అలాంటి యుంటాయంటగా?"

క్షణం ఆలోచనలో పడింది పార్వతమ్మ గారు.

నిజమే వీణ్ణి అనాథాశ్రమంలో చేర్పొచ్చు. దాని మూలంగా మరింత పేరు ప్రఖ్యాతులు కూడా సంపాదించవచ్చు. నాని లేడీస్ క్లబ్ ప్రెసిడెంట్ తాయారు ఇప్పటికే తన మీద చాలా చెడు ప్రచారాలు చేసింది. అంతేకాక ఆ మధ్య ఓ అనాథ పిల్లని చేర్చి ఓ పాతిక వేలు అనాథాశ్రమానికి విరాళం కూడా ఇచ్చింది. దీంతో ఆవిడ గారు ఓ దేవతయి కూర్చుంది. ఆ దేవత కన్న పేరు సంపాదించాలంటే తను మరో పదివేలు ఎక్కువగా ఇవ్వాలి. ఈ దార్నపోయే తద్దినానికి ముప్పయి వలభై వేలు ఖర్చు చేయడం తెలివి తక్కువతనం. ఇలా వున్నాయి ఆవిడ



ఆలోచనలు.

"ఏంటమ్మ గారూ?" మళ్ళీ అడిగింది లచ్చి.

"లాభం లేదే లచ్చి. దానిక్కూడా చాలా తతంగం వుంది" అంది పార్వతమ్మ గారు. అయితే ఆ పసివాణ్నెలా ఒదులుకోవాలో మాత్రం అర్థం కావడం లేదామెకి.

బాబు కదిలాడు,

కంగారుగా చూసిందావిడ.

వాడు గుక్క మొదలెట్టాడు.

ఆవిడ మొహం చిట్లించి-

"'ఛ, వెధవ గోల! అదేపతో చెత్త కుండీలోనో, ముళ్ళ కంపల్లోనో పడెయ్యక నా కొంప ముందు పడేసి వచ్చింది" అనుకుంది గొణిగినట్లు. అయితే ఆవిడ గొణిగినట్టే అన్న మాటలు కోటప్ప దంపతులకి వినిపించనే వినిపించాయి.

ఏడుస్తున్న పసివాణ్ని జాగ్రత్తగా చేతుల్లోకి తీసుకున్నాడు కోటప్ప.

"లచ్చీ! పద"అన్నాడు లేచి నిల్చుంటూ.

తృళ్ళిపడింది పార్వతమ్మ గారు.

బిత్తర పోయింది లచ్చి.

"ఈణ్ని నేను పెంచుకుంటా నమ్మగారూ" అన్నాడు కోటప్ప పసివాడిని గుండెల కదువుకుంటూ.

"నువ్వా!" అందామె విస్మయంగా.


"అవునమ్మా! ఈడూ నా బిడ్డల్తోటే పెరుగుతాడు"-స్థిరంగా వుంది కోటప్ప గొంతు.

పార్వతమ్మగారి మొహం వెల వెలపోయింది.

"నీకే తిండీ లేదు. ఇక వాణ్నేం పెంచుతావ్!" అంది. అది ఆశ్చర్యమో, వ్యంగ్యమో అర్థం కాలేదతనికి. అయినా చిన్నగా నవ్వేసి-

"పర్లేదమ్మా! నాను తినే గంజన్నమే ఈడికీ కూసంతెడతాను. ప్రేవోజన మాతో పాటే పస్తులుంటాడు. ఆడికి అమ్మా బాబూ ఎలాగూ లేరు. ఆళ్ళని తెచ్చివ్వనూ లేం, కూసంత ఆదరవే గందా! అయినా అందరం ఒగ్గేత్తే ఈ నెత్తురు గుడ్డైపోతాడమ్మా!" కళ్ళలో అద్దుకుంటూ అన్నాడు.

పార్వతమ్మగారి మొహం నెత్తురు బొట్టు లేనంత తెల్లగా పాలిపోతే, లచ్చి మొహం పున్నమి చంద్రుళ్ళా వెలిగిపోయింది. భర్త చేతిలోని పసివాణ్ని తను తీసుకుని గుండెలకి హత్తుకుంటూ-




"మా డాడీకి మా మమ్మీ అంటే ఎంత ప్రేమో!"

"మా డాడీకి మా మమ్మీ అంటేనే కాదు, మా ప్రక్కింటి ఆంటీ అన్నా ప్రేమే!"

— షేక్ కరీముల్లా (బాపట్ల)

"ఓర్నానా! నువ్వనాదవి కావు ! నీ కమ్మా బాబే కాదు, అక్క, అన్న కూడా వుండారు. పద! మనింటికెల్దాం" అంది.

పార్వతమ్మ గారు తేరుకుని-

"నువ్వా తాగుబోతు వెధవ్వి. నీ పెళ్ళాం పిల్లలకే తిండి పెట్టే చావ్వు. అలాంటి వాడివి"-ఆమె మాట పూర్తి కానే లేదు.

"నిజమేనమ్మా! నేను తాగుబోతెదవనే, నా పెళ్ళాం బిడ్డల్ని ఏడిపించినా మాట నిజమే. కానీ నేను మడిసినమ్మా! ఈ పసిగుడ్డు మట్టిలో ఇలా ఏడుస్తాంటే నాకు పట్టనట్టు అందరిలా తప్పుకునేంత గుండె ధైర్యం నాకు లేదు తల్లీ! అందుకే నాక్కున్న దెట్టే ఈణ్ని సాక్కుంటాను" గంభీరంగా అన్నాడు కోటయ్య.

లచ్చి మొహం మరింత వెలిగింది. భర్త కేసి అనురాగంగా చూస్తూ-

"అవునమ్మ గారూ! ఈ డు తాగు బోతే! ఈడికి తాగితే ఒల్లు తెల వదు కానీ ఈడిలో దేవుడున్నాడమ్మా! అయుదవేలవాటు లేకపోతే మా మావ మీ అందరి కన్నా గొప్పోడు" గర్వంగా అంది.

పార్వతమ్మగారి మొహం మాడిపోయింది.

"అయన్నీ ఎందుకే లచ్చీ! మనం ఎవురో మెచ్చుకుంటారనా ఈణ్ని సాకేది! కాదే!మన మనసుకోసం, మన తృప్తి కోసం! పద-ఇయ్యాల్టి నించీ నేను సుక్క ముట్టనే. ఈడు నన్ను మార్చడాకొచ్చిన దేవుడనుకుంటున్నాను." మనస్ఫూర్తిగా అన్నాడు కోటప్ప.

ఎప్పుడూ భర్త నోటంట అలాంటి మాట వినని లచ్చి మనసు ఆనందంతో పురకలు వేసింది. ఎంత తాగుబోతయినా భర్త అబద్ధం ఆడడని ఆమెకి తెలుసు. అందుకే భర్త చెయ్యి పట్టుకుని-

"పద మావా! ఇయ్యాల నాకు మా పెద్ద పండగ" అంది. కోటప్పవెనక్కి తిరిగాడు.

పార్వతమ్మగారి మొహం అమావాస్య చంద్రుళ్ళా వుందని వేరే చెప్పనక్కర్లేదను కుంటారు. గిల్టీగా ఫీలవుతూ-

"ఆగండి" అంది.

ఇద్దరూ ఆగి వెనక్కి తిరిగి చూసారు.

"బాబును వుంచుకుంటారా?" అన్నాడు కోటప్ప.

"అహ! అదేం కాదు.పిల్లాడి పాలకి డబ్బేమైనా..." నసిగిందామె.

"ఒద్దులెండమ్మా! మీరియ్యాల్టికిచ్చినా రేపెవ్వరిస్తారు? అదుకే మా పాట్లేవో మేమే పడతాం" అన్నాడు కోటప్ప.

"అదని కాదు కోటప్ప. ఈ పది రూపాయలు తీసుకొ ని ఓ చొక్కా కొను..."రానంటున్న గొంతుని అతి బలవంతంగా పెకల్చుకుని అంది పార్వతమ్మగారు.

కోటప్ప నవ్వాడు. ఆ నవ్వులో-

"నువ్విచ్చే దేమైనా, మా ప్రేమాభిమానాల ముందు తృణప్రాయమే సుమా" అన్న భావం కనిపించిందామెకి. చాచిన చెయ్యి నోటుతో సహా వెనక్కివచ్చేసింది.

"వస్తానమ్మ గారు" అంటూ మళ్ళీ వెనక్కి తిరిగి గేట్టు వైపు నడిచారా దంపతులు.

పార్వతమ్మ గారిలోని భేషజం, గర్వం లాంటి వన్నీ తాత్కాలికంగా పక్కకి తప్పుకున్నాయి. తమకేం కాని పసి బిడ్డని అక్కున చేర్చుకుని మెల్లగా సాగి పోతున్న ఆ దంపతులామె కళ్ళకి మేరువు పర్వతాల్లా, పరమాత్ముని విశ్వరూపంలా, అనంత విశ్వంలా, ఆది దంపతుల్లా ఇంకా చాలా రకాలుగా కనిపించారు.

అప్రయత్నంగా ఆమె చేతులు లేచి వారికి నమస్కరించాయి.

